RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 3, సంచిక : 264

శనివారం
సెప్టెంబర్ 20, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

దినపత్రిక



బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

2లో..

# లక్ష్యసాధన దిశలో తెలంగాణ



**వేద న్యూస్, డెస్క్ :**

ప్రపంచంలో అగ్రభాగాన నిలపాలన్న బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టే పెట్టుబడులకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని, అవసరమైన భద్రత ఉంటుందని స్పష్టం చేశారు.

**- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి**
**- పారిశ్రామికవేత్తలకు సీఎం పిలుపు**
**- అవకాశాల సృష్టి మా ఆలోచన**
**- పబ్లిక్ ఎఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా సదస్సుకు రేవంత్ హాజరు**

ప్రతిష్టాత్మక పబ్లిక్ ఎఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. పారిశ్రామిక రంగంతో పాటు అన్ని రంగాల్లో ప్రగతి లక్ష్యాలపై తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈ ఏడాది డిసెంబర్ 9 న ఆవిష్కరించబోతున్నట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. లక్ష్య సాధన దిశగా పయనిస్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. పారదర్శకమైన పరిపాలన అందించడానికి రాజకీయ సంకల్పం కావాలి. భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలన్నదే మా ఆలోచన.





దేశంలోనే యువ రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం కొత్తగా ఏర్పడినప్పటికీ తెలంగాణకు, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించాం. రాష్ట్రాన్ని భౌగోళికంగా మూడు ప్రాంతాలు.. కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజన చేశామని తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో కోటి మంది నివసిస్తున్నారు. కోర్ అర్బన్ ప్రాంతం సేవా రంగానికి విని యోగించాలని ఈ ప్రాంతంలోని కాలుష్య కారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నాం. సెమీ అర్బన్ ప్రాంతాన్ని తయారీ రంగం కోసం ప్రత్యేక జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పారు. తెలంగాణలో అభివృద్ధికి తగినట్లు 70 కి.మీ ఉన్న మెట్రోను 150 కి.మీ పొడిగించాలని నిర్ణయించాం. ప్రస్తుతం అయిదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నారు.. దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తాం. అందుకు మూసీ నది పునరుజ్జీవంపై దృష్టి సారించామని

మిగతా 2వ పేజీలో..



## పీఎం ఆవాస్ యోజన పనులను వేగవంతం చేయాలి

### - పంచాయతీ అధికారి జగదీశ్వర్

**వేద న్యూస్, గంగాధర :**

జిల్లాలో పీఎం ఆవాస్ యోజన పనులు ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లాలోని అన్ని మండల పంచాయతీ అధికారులు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ల తో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, "ప్రభుత్వ పథకాల అమలులో లోపం ఉండకూడదు అని ప్రతి అర్హులైన కుటుంబానికి పీఎం ఆయాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలి," అని అన్నారు. అలాగే, గ్రామాల స్థాయిలో ఇంటి పన్ను మరియు నల్ల బిల్లుల వసూలు పనులను కూడా తక్షణమే ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ దమ్మని రాము, ఎంపీఓ గౌరీ రమేష్, హౌసింగ్ ఏఈ యశ్వంత్, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చెరువును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు



### - మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఒప్పించి నేను కొప్పుల గ్రామం నుండి పరకాల నేషనల్ హైవే మధ్యన చలివాగు పై బ్రిడ్జి నిర్మాణం కొరకు ఎస్ టి ఎస్ డి ఎఫ్ 2023-24 నుండి రూ.574 లక్షలు , కొప్పుల గ్రామం నుండి పరకాల వరకు బిటీ రోడ్డు నిర్మాణం కొరకు రూ.585 లక్షలు మంజూరు చేయించి, టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించడం జరిగింది అన్నారు. జరుగుతున్న పనులను ఆపివేసిన ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేను నిధులు తెచ్చిన అంటూ మేము వేసిన శిలాఫలకాల పక్కనే శిలాఫలకాలు వేసి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేయడం ఏంటని ఏద్దేవా చేశారు.నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు హుస్సేన్ పల్లి నుండి మైలారం వరకు వయా పెద్ద చెరువు కట్ట మీదుగా కోటి అరవై లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇష్టరాజ్యంగా పనులు చేస్తున్నారు అలాగే కాంగ్రెస్ నాయకులకు సహకరించని అధికారులను ట్రాన్స్ఫర్ చేయిస్తూ వారిపై కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారు అన్నారు. ఎస్సిలకి సంబంధించిన స్మశాన వాటికను కూడా ఆక్రమించుకున్నారు.అంటే అధికార పార్టీ నాయకులు ఏదీ చేసిన మాఫ్ అనే ధోరణి నడుస్తుంది. ఇరిగేషన్ అధికారులు , రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెరువును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొప్పుల గ్రామంలో వేసిన శిలా ఫలకాలను చూసి శిలాఫలకాల మోజులో ప్రజలను ఏమార్చుతున్నారు అంటూ చురకలు వేశారు.వారి వెంట శాయంపేట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సురేఖమ్మ మీరు సల్లంగుండాలె

**వేద న్యూస్, హైదరాబాద్ :**

స్టేట్ ఎండోమెంటు శాఖ పరిధిలోని పలువురికి డెత్ గ్రాట్యూటీ సత్వరంగా ఇప్పించినందుకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖకి బాధిత కుటుంబీకులు ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. సురేఖమ్మ... నువ్వు సల్లంగుండాలె అంటూ భావోద్వేగ వచనాలతో ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు డెత్ గ్రాట్యూటీని శుక్రవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. అయితే, డెత్ గ్రాట్యూటీ ఇచ్చినందుకు దేవాదాయ శాఖ మంత్రి సురేఖకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం తన పేషీలో 20 బాధిత కుటుంబాలకు రూ. కోటి ఐదు లక్షలు స్వయంగా ఇచ్చారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆరుగురు ఎండోమెంటు ఉద్యోగుల కుటుంబాలకు, రీటైర్ అయిన ఉద్యోగులకు, ఉపనయనం బెనిఫిట్స్, ఎడ్యుకేషన్ లోన్ సంబంధిత సాయాలను అందజేశారు. అయితే, ఈ గ్రాట్యూటీ ప్రక్రియను వేగవంతం చేసి, తమకు గ్రాట్యూటీ ఫండ్ త్వరితగతిన వచ్చేందుకు సాయం చేసిన మంత్రి సురేఖకు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు ఉద్యోగులకు ఎటువంటి కష్టం వచ్చినా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల బాగోగులను మంత్రి సురేఖ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మంత్రితో తమ సమస్యలు చెప్పుకుంటూ వాపోయారు. డ్యూటీలో తమ భర్త చనిపోవడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని మంత్రి దృష్టికి పలువురు మహిళలు తీసుకొచ్చారు. అయితే, ఆర్థిక ఇబ్బంది ఉన్న మహిళలకు అండగా నిలిచేందుకు ఏదైనా మార్గాలను అన్వేషించి, తగు న్యాయం చేయాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను ఆదేశించారు. మన దేవాదాయ శాఖ కోసం సేవలు అందిస్తున్న క్రమంలో మరణించిన వారి కుటుంబాలకు కేవలం గ్రాట్యూటీ ఇచ్చి సరిపెట్టొద్దని, ఎక్కడ..ఏ విధంగా సాధ్యమైనా మన బాధ్యతగా సాయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. మంత్రి సురేఖ స్పందనకు బాధిత మహిళలు కన్నీరు పెడుతూ భావోద్వేగానికి గురయ్యారు. వారిని మంత్రి సురేఖ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, వెంకటేశ్, రామకృష్ణరావు, పీఎస్ సోమరాజు, ఓఎస్డీ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో

వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :

ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహమ్మద్ సలీం మాట్లాడుతూ ఆహార నిల్వలు వంట పాత్రలు రిజిస్టర్లు తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం వంట చేయు కార్మికురాలితో పాత్రలు మరియు పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిల్లలకు వేడివేడి ఆహారాన్ని మాత్రమే అందించాలని అన్నారు. ఎలాంటి కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు వహిస్తూ పిల్లలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ




**వేద న్యూస్, వరంగల్:**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.సమావేశంలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, గత సమావేశంలో చర్చించి తీసుకొన్న చర్యల గురించి వివరిస్తూ, ప్రస్తుతం 26 కేసు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని అన్నారు. ప్రతీ నెల తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించే సమావేశానికి తహసీల్దార్, ఎస్హెచ్ఓలు సంబంధిత శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ అన్నారు. గ్రామల్లో గుడుంబా, గంజాయి అరికట్టుటకు ఎక్సైజ్ అధికారులు శ్రద్ధ పెట్టాలని అన్నారు. కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాట్లాడుతూ ప్రతినెలా సివిల్ రైట్స్ డే అధికారులు అందరు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని, నల్లబెల్లిలో ఎమ్మార్వో, ఆర్ ఐ ల మధ్య నెలకొన్న అంశంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అలాగే ఎస్సీ ఎస్టీలకు మార్నింగ్ బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. అందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమీక్ష లో జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళి , డీఈఓ రంగయ్య నాయుడు, డిడబ్ల్యుఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఏసీపీ లు రవీందర్, వెంకటేష్ ఎస్ హెచ్ వోలు విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్, చిన్న స్వామి, యాదగిరి, మహేందర్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కేయూ డిగ్రీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ అభ్యసించే విద్యార్థిని విద్యార్థులు డిగ్రీలో మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరిక్ష ఫీజు నోటిఫికేషన్ ను పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్, అదనపు పరిక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్య సంయుక్తంగా నేడు విడుదల చేసారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అక్టోబర్ 15 వరకు పరీక్ష ఫీజులు చెల్లించాలని తెలిపారు. అపరాధ రుసుము యాబై రూపాయలతో అక్టోబర్ 22 వరకు గడువు ఉన్నట్లు వివరించారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.kakatiya.ac.in ద్వారా చూడవచ్చని, కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థిని విద్యార్థులు గమనించాలని తెలిపారు.

# బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

మహిళా సాధికారతకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎంపీ కడియం కావ్య అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళా సాధికారతకు నిదర్శనమని, ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబం అని పేర్కొన్నారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలను తొలిసారిగా సందర్శించిన ఎంపీ కావ్యకు ప్రిన్సిపాల్ డా. కె. భిక్షాలు ఘనంగా స్వాగతం పలికారు. అధ్యాపకులు, విద్యార్థులంతా కలిసి ఘనంగా స్వాగతం అందించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య కళాశాల టీచింగ్ స్టాఫ్ తో సమావేశమయ్యారు. కళాశాల సమస్యలు, అవసరాలపై ప్రిన్సిపాల్ డా. భిక్షాలు వివరించారు. అందుకు స్పందించిన కడియం కావ్య, అవసరమైన నిధుల సమీకరణలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మహిళల హాస్టల్ సమస్యలు, ఎస్ఎఫ్ సి కోర్సులను రెగ్యులర్ విధానంలోకి మార్చే అంశాలు, ఇతర పరిపాలనా సమస్యలపై ఎంపీ కావ్య దృష్టి సారించారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. పండుగ సందర్భంగా విద్యార్థినులతో కలిసి సంప్రదాయ బతుకమ్మ ఆడారు. తెలంగాణ ప్రజల గుర్తింపుగా బతుకమ్మను అభివర్ణిస్తూ, ఇది మహిళా సాధికారతకు నిదర్శనం అని కొనియాడారు. రాణి రుద్రమ, సమ్మక్క–సారలమ్మల ధైర్య సాహసాలను స్మరించుతూ, "ఇది మన సంస్కృతికి అద్దం పట్టే పండుగ" అని అన్నారు. వేడుకల్లో కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల, దూర విద్యా సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, సిడిసిడీన్ ఆచార్య వరలక్ష్మి, డా. కె. అయిలయ్య, డా. వేణుగోపాల్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు వెంకటేష్, కిరణ్, వీణ, జోష్న, శ్రీవిద్య, సహాయ రిజిస్ట్రార్ రామా వెంకటేశ్వర్లు, బానోత్ వీరయ్య నాయక్, విద్యార్థులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బాలలకు ఎడ్యుకేషనల్ కిట్ పంపిణీ

**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్లోని ఎనుమాముల ఎన్టీఆర్ నగర్ నందు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ కు వలస వచ్చి తల్లిదండ్రులతోపాటు విద్యా వసతులు లేకుండా ఉండి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బాలలకు శుక్రవారం ఎడ్యుకేషనల్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రి నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.


ఆంటీ హ్యూమన్ ట్రాఫిక్కింగ్ యూనిట్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా పోలీసు మరియు ఇతర శాఖల సహకారంతో బడి బయట ఉన్న పిల్లల్ని, బాల కార్మికులు మరియు నిరాదరణ కలిగిన పిల్లల్ని గుర్తించడం మరియు రెస్క్యూ చేయడం జరిగిందన్నారు. అనంతరం వారి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. అయితే పూర్తిస్థాయి పునరావాసం పిల్లలకు జరగాలంటే వారికి విద్య అందించడమే ప్రాథమిక లక్ష్యం అని దానిలో భాగంగానే శుక్రవారం ఈ యొక్క పాఠశాలలో బీహార్ మరియు ఒరిస్సా ప్రాంతం నుంచి వచ్చిన సుమారు 62 మంది పిల్లల్ని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో అడ్మిట్ చేసి వారికి కావలసిన పూర్తి సహకారాలను అందించడం జరుగుతుంది తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన బాలలతోటి మాట్లాడుతూ జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని దాన్ని సాధించడానికి ప్రయత్నం చేయాలని దాన్ని సాధించడానికి చదువు అనేది ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. పిల్లలందరూ ఒక లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. అదేవిధంగా పిల్లల్ని ఎవరైనా తల్లిదండ్రులు గాని, వ్యాపారస్తులు గాని పనిలో పెట్టినట్టయితే చట్టరీత్యా వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు .ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ పోలీస్ అంకిత్ కుమార్ హాజరై మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి చొరవ తీసుకోవడం అనేది తెలంగాణ రాష్ట్రంలో ప్రథమం అని దీని కొనసాగింపుగా ఇతర వర్క్ సైట్లల్లో కూడా పిల్లలకందరికీ చదువుకునే లాగున పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని దీనికి దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో సాంఘిక సేవా సంస్థ వరంగల్ సహాయంతో పిల్లలకు ఉచితంగా బ్యాగులు పుస్తకాలు మరియు ఇతర సామాగ్రిని అందజేయడం జరిగింది. ఈ




వలస వచ్చిన బాలుల కొరకు ప్రత్యేకంగా డాన్ బాస్కో సహకారంతో ఇద్దరు టీచర్లను ఏర్పాటు చేశారు. వారికి చదువు నేర్పించడం జరుగుతుందని తెలిపారు.

ఈ యొక్క కార్యక్రమంలో మామునూర్ ఏసీపీ వెంకటేష్ ,ఏనుమాముల ఎస్హెచ్ఓ సురేష్ కుమార్, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్స్పెక్టర్ జె శ్యాంసుందర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ వి వసుధ ,ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, డాన్ బాస్కో ఎన్జీవో ఫాదర్ కోసి, సంస్థ కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, ఎం అజయ్ కుమార్ యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ సిబ్బంది ఎస్ ఐ సుధాకర్, శ్రీనివాస్, రామారావు, భాగ్యలక్ష్మి సమయుద్దిన్, పాషా మరియు ఏనుమాముల పిస్ ఎస్ఐ లు రాజు, రాజు, సిబ్బంది, తదితరులతోపాటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వెబ్ డెవలప్మెంట్ ట్రైనింగ్



**వేద న్యూస్, హైదరాబాద్:**

విద్యార్థులను కేవలం తరగతి పాఠ్యపుస్తకాలలోని అంశాలకే పరిమితం చేయకుండా, వివిధ రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని సిటీ కాలేజి అధ్యాపకులు డా.కె.శారద అన్నారు. బరాబరి కలెక్టివ్ అనే స్వచ్ఛంద సంస్థతో ఉన్న ఒప్పందంలో భాగంగా ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు 9 నెలల శిక్షణ కార్యక్రమం గురించి అవగాహన కల్పించామని తెలిపారు. విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుని వెళ్లేలోపు శిక్షణ ముగించుకుని, ఉద్యోగ అవకాశం పొందుతారని అన్నారు. బరాబరి నుండి వక్తగా పాల్గొన్న హరిహరన్ మాట్లాడుతూ శిక్షణలో చురుకుగా పాల్గొనే విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఉచిత లాప్ టాప్ లు అందజేస్తామని అన్నారు. కోర్సు సమయంలో, అభ్యర్థులు టెక్ ప్రొఫెషనల్స్ నుంచి వ్యక్తిగత మార్గదర్శకత్వం పొందుతారని, తద్వారా ఉన్నత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసియా, జయదేవ్, రుచిత, షణ్ముక్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధన దిశలో తెలంగాణ


వివరించారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నాం. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయి. అందుకే ఈవీలకు రాయితీలు ప్రకటించాం. రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ అనుసంధానత కల్పిస్తాం.

తెలంగాణలో సేంద్రియ పంటలు పండుతున్నాయి. ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న మాదక ద్రవ్యాలను తెలంగాణలో కఠినంగా నియంత్రిస్తున్నాం. వాటి నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విజ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరం. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు తెలంగాణలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. తమ ప్రభుత్వం మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తోంది. స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వస్తాయన్నారు. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఒలింపిక్స్ పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. తెలంగాణకు ఓడ రేవు లేనందున, మచిలీపట్నం ఓడ రేవుతో అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణ నుంచి జరుగుతోంది. వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల ఆ దేశానికే ఎక్కువగా నష్టం చేకూర్చేలా ఉన్నాయి.." అని వివరించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చా గోష్టిలో పీఏఎఫ్ఐ అధ్యక్షుడు చేతన్ కృష్ణ, సెల్ కాన్ గ్రూప్ చైర్మన్ గురుస్వామి నాయుడు, గోద్రేజ్ కార్పొరేట్ ఎఫైర్స్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బిజినెస్ స్టాండర్డ్ ఎడిటోరియల్ డైరెక్టర్ అశోక్ భట్టాచార్య మాడరేటర్‌గా వ్యవహరించారు.

# పోలేరమ్మ ఆలయంలో చోరీ..

**వేద న్యూస్, మెట్ పల్లి :**

మెట్ పల్లి పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు సిసి కెమెరాలను ధ్వంసం చేసి అమ్మవారి విగ్రహంపై ఉన్న వెండి పట్టగొలుసులు, బంగారు ముక్కుపుడక, బొట్టుబిళ్ళ ను ఎత్తుకెళ్లినట్టు స్వర్ణకర సంఘం అధ్యక్షుడు వంగళ మహేష్, తెలిపారు. కాగా,ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆలయంలో చోరీ జరగడం ఇది ఐదవసారి అని అన్నారు.




# పరామర్శ

వేద న్యూస్,శాయంపేట: శాయంపేట గ్రామానికి చెందిన సామల నాగరాజు ఇటీవల బైకు యాక్సిడెంట్ కారణంగా కాలుకు గాయాలు అయిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పరామర్శించారు. మీరు వెంట టిఆర్ఎస్ నాయకులు మెతుకు తిరుపతిరెడ్డి, విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, మోహన్, దైనంపల్లి సుమన్, అరికిల్ల ప్రసాద్, దాసి శ్రావణ్ కుమార్ లు సామల నాగరాజు ని పరామర్శించారు.



## రాపాక ఉదయ్ శర్మకు "పురోహిత దిగ్గజ" బిరుదు ప్రధానం



**వేద న్యూస్,వరంగల్:**

విల్లుపురం (తమిళనాడు) కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరిట్యువల్ ఆస్ట్రోలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "6వ ఇంటర్నేషనల్ స్పిరిట్యువల్ ఆస్ట్రోలాజికల్ కాన్ఫరెన్స్ ఐకానిక్ అవార్డ్స్ తెలంగాణ - 2025" శనివారం వరంగల్ పుష్పరాజ్ కన్వెన్షన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ వాస్తుపురోహితులు, వివర్స్ కాలనీ శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రధాన అర్చకులు రాపాక ఉదయ్ శర్మ కు విశిష్ట సేవలకు గాను "పురోహిత దిగ్గజ" బిరుదుతో సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జె. విశ్వనాథన్ చేతుల మీదుగా, స్థానికంగా పలువురు ప్రముఖ పండితుల సమక్షంలో శాలువా కప్పి, సన్మానించారు.

## విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన సదస్సు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు..,గుడ్ టచ్-బ్యాడ్ టచ్ పైన షిటిమ్ వాళ్ళు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం సభ్యురాలు ప్రమీల, మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ కల్పించడంలో షీటీమ్, ఎప్పుడు అందుబాటులో ఉంటుందని, నేరుగా ఫిర్యాదు చేయాలని షీటీమ్ సభ్యురాలు ప్రమీల, తెలిపారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు షీటీమ్ సభ్యులు పలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు ప్రమీల మాట్లాడుతూ ఆన్లైన్లో జరిగే మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైన లేదా ఎవరైనా వేధింపులకు పాల్పడినట్లు తెలిసినా వెంటనే షీటీమ్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు, వీరయ్య, శ్రీనివాస్, శ్రీలత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్,ఇంచార్జ్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు,వెంకటహనుమాన్, మధు, సురేందర్ రెడ్డి, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

## పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

యూనివర్సిటీ పీజీ కళాశాల నిర్వహించిన బతుకమ్మ పండుగ ప్రేరణ, సృజన తాలూకు విలువలు చాటివుండేలా ఉంటాయని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల అన్నారు. సుబేదారిలోని విశ్వవిద్యాలయ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహ చారి ఆధ్వర్యంలో కళాశాలలో ఉద్యోగినులు, విద్యార్థినులు నిర్వహిస్తున్న ముందస్తు బతుకమ్మ ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ పండుగలన్నీ శాస్త్రీయతను కలిగి ఉంటాయని, ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి

### - రాజయ్య అనే వ్యక్తి మృతి



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసే సమాచారాన్ని తెలుసుకుని అక్కడ నుంచి పారిపోయే క్రమంలో వెంకటాపూర్ కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ కు చెందిన చాకలి రాజయ్య(55) గత కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి వెంకటాపూర్ శివారులోని ఓ గుడిసెలో పేకాట ఆడుతున్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నది గమనించి రాజయ్య పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంకటాపూర్ శివారులోని అర్బన్ పార్కు ముందు నుంచి పారిపోతూ మానేరు వాగు లోంచి ఆయాసంగా ఒడ్డు పైకి చేరి కుప్పకూలిపోయినట్లు తెలిసింది. అటుగా వెళ్తున్న కొందరు చూసి అతన్ని లేపే ప్రయత్నం చేయగా అప్పటికే రాజయ్య మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## విద్యార్థులకు డిక్షనరీ పంపిణీ



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో చంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు చెన్న మాధవుని రామరాజు,ఆరవ తరగతి విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరము ఇదే మాదిరిగా నూతనంగా పాఠశాలలో చేరిన ఆరవ తరగతి విద్యార్థులకు చంద్ర ట్రస్ట్, ద్వారా రామరాజు, ఇస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి ఉపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి,నర్సయ్య,వేణుగోపాలచారి పాల్గొని రామరాజుకు, ధన్యవాదాలు తెలిపారు.

## ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుంకే ప్రభాకర్



వేద న్యూస్, హైదరాబాద్ :

మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సుంకే ప్రభాకర్‌ను నియమించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ స్వయంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మైస ఉపేందర్ మాట్లాడుతూ, మాదిగ సమాజ హక్కుల సాధనలో ప్రభాకర్ అంకితభావం, కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజ బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమితి సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లో విస్తరించి, సమాజ అభివృద్ధికి ప్రభాకర్ కీలకంగా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో సమితి కార్యకలాపాలను మరింత బలపరచడమే ఈ నియామక ప్రధాన ఉద్దేశమని ఉపేందర్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సుంకే ప్రభాకర్ మాట్లాడుతూ, సమాజం తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, సమితి సిద్ధాంతాలు, లక్ష్యాలను గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తరించి, మాదిగ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకాన్ని మరింత బాధ్యతగా భావించి, సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు కత్తి విష్ణు,ప్రధాన కార్యదర్శి దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

### -ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్ల పెల్లి యుగంధర్

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలో నిరుద్యోగులను ఆసరాగా చేసుకుని కోచింగ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారి నుండి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ నిరుద్యోగ యువతీ,యువకులను దోచుకుంటున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్ల పెల్లి యుగంధర్ ఆరోపించారు. మెటీరియల్ పేరా డబ్బులు వసూలు చేస్తూ,కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఐకాన్ కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కాంపిటేషన్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగుల నుండి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీసం రసీదులు కూడా ఇవ్వడం లేదని యుగంధర్ విమర్శించారు. నగరంలోని గీతా భవన్ చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న ఐకాన్ కోచింగ్ సెంటర్ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ ఇరికిరుకు గదుల్లో కోచింగ్ సెంటర్ పేర క్లాసులు నిర్వహిస్తూ లాంగ్ టర్మ్,షార్ట్ టర్మ్ పేరా వేల రూపాయలు నిరుద్యోగుల నుండి దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరుకు గదుల్లో శిక్షణనిస్తూ, ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేకుండా, బహుళ అంతస్తుల భవనములో మూడు,నాలుగు ఫ్లోర్లలో క్లాసులు నిర్వహిస్తూ, పార్కింగ్ స్థలాలు లేకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని వీటిపై కొరడఝులించాల్సిన ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు.

గ్రూప్స్, బ్యాంకు,ఎస్ఎస్సి, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాల కు శిక్షణ ఇస్తున్నామని చెప్పుతూ పెద్ద పెద్ద ప్రకటన లు ఇస్తూ నిరుద్యోగ యువత కు మా కోచింగ్ సెంటర్లో శిక్షణ తీసుకుంటే ఉద్యోగం గ్యారెంటీ అంటూ వేల రూపాయలు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరీంనగర్ నగరంలో విచ్చలవిడిగా కోచింగ్ సెంటర్లు పదుల సంఖ్యలో నెలకొల్పబడుతున్నాయని వీటికి కనీస నిబంధనలను పాటించడం లేదని వీటిపై జిల్లా కలెక్టర్ తనిఖీలు చేసి అధిక ఫీజులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కోచింగ్ సెంటర్ల అధిక దోపిడీ పై, కనీస సౌకర్యాల కల్పనకై ఆందోళన చేపడతామని యుగంధర్ హెచ్చరించారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**వేద న్యూస్, చొప్పదండి**



కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రాగంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిందర్, బిజిలి కనకయ్య లకు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సాయన్న లను విద్యార్థుల తల్లిదండ్రులు శాలుతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గసికంటి కుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అందించిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం రాగంపేట ఉపాధ్యాయులకు రావడం చాలా సంతోషమని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు గురువుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలి. వారు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని సాధన చేసి నేర్చుకుంటే మనము కలెక్టర్లుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా కానీ గొప్ప ఉన్నత స్థాయిలో ఉంటారు అని అన్నారు. కనుకయ్య సార్ చెప్పే నూతన ఒరవడి విద్యా విధానం ఆటపాటలతో ఆడుతూ పాడుతూ విద్యార్థులకు బోధించే విధానం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా పాఠాలు చెప్పడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, సాయన్న గత 16 సంవత్సరాల నుండి రాగంపేట స్కూల్లో పనిచేయడం రాగంపేట విద్యార్థుల యొక్క అదృష్టం అని అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సందర్భంగా మా ఊరి తరపున మా తరపున ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యమ కవి గాయకులు మావురాల ఎల్లమ్మ ఫేమ్ గసికంటి కుమార్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దీకొండ రమణ సాయి, అరేపెల్లి అంజయ్య, దీకొండ సంపత్, శిరావెల్లి శేఖర్, బొనగిరి కుమార్, గసికంటి గణేష్, బొల్లి మహేష్, దారా అంజిబాబు, దీకొండ సాగర్, కూటికల మహేష్, దీకొండ సుధాకర్ మరియూ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేట తహసిల్దార్ గా ప్రవీణ్ కుమార్

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట తహసిల్దారుగా ప్రవీణ్ కుమార్ ను నియమస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కల్వల సత్యనారాయణ ను జిల్లా కలెక్టరేట్ కు బదిలీ చేశారు. నూతన తహసిల్దార్ గా వచ్చిన ప్రవీణ్ కుమార్ ను డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతి, ఏం ఆర్ ఐ రమేష్, ఏ ఆర్ ఐ రమేష్, జి పి ఓ లు కార్యాలయ సిబ్బంది తహసిల్దార్ కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



వేద న్యూస్

శనివారం సెప్టెంబర్ 20, 2025

# మండలస్థాయి ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం విద్యాధికారి కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలాగే సెర్ప్ వివోఎ, ఉద్యోగులతో శిక్షణ సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్,అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా వారు మాట్లాడుతూ 100 శాతం అక్షరాస్యత సాధించడానికి మనకు లభించిన గొప్ప అవకాశం ఉల్లాస్ ప్రోగ్రాం అని, దీని ద్వారా తల్లిదండ్రులకు కొంతవరకైనా అక్షర జ్ఞానం సాధిస్తే ఆ ఇల్లు విద్యానిలయంగా మారుతుందని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని, అలాంటి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం వచ్చిందన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్,మాట్లాడుతూ వయోజునులను విద్యావంతులు చేయడానికి అరుదైన అవకాశం ఈ అక్షర వికాసం అన్నారు. ఈ ప్రోగ్రాం నిర్వహణ మండల రిసోర్స్ పర్సన్స్ గంగాధర కనుకయ్య,సురేందర్ స్వామి, చేసారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రవణ్ కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోను భూమయ్య,బొలుగం శ్రీనివాస్,ఉషారాణి, సెర్ప్ ఎపిఎం జయసుధ,కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ గడదాసు సత్యనారాయణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గ్రామ వివోఎ, లు క్లస్టర్ సీఆర్పీలు,ఐఈఆర్పి, ఎమర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

# 69వ మండల స్థాయి ఎస్ జిఎఫ్ఐ ఎంపిక



**వేద న్యూస్,శాయంపేట:**

అరవై తొమ్మిది వ మండల స్థాయి ఎస్ జిఎఫ్ఐ ఎంపిక శాయంపేట మండలం జడ్పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్లో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎంపీడీవో ఫణి చంద్ర , సభాధ్యక్షులుగా స్థానిక ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, విశిష్ట అతిథి స్థానిక మండల విద్యాశాఖ అధికారి, ఎస్ జి ఎఫ్ ఐ ప్రెసిడెంట్ గడ్డం బిక్షపతి, టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాసిరి రాజి బాపు రావు , ఏం జె పి ప్రిన్సిపల్ రేవతి, గర్ల్స్ హై స్కూల్ ఇన్చార్జ్ హెడ్మాస్టర్ శేఖర్ బాబు , ఎస్ జి ఎఫ్ ఐ మండల కార్యదర్శి డాక్టర్ రాము , గీత , తరంగిణి ,జ్యోతి, సతీష్, రజినీకాంత్, పాల్గొన్నారు. అనంతరం జరిగినటువంటి కోకో కబడ్డీ , వాలీబాల్ అండర్ 17 అండర్ 14 విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. సభాధ్యక్షులు జనార్ధర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని చక్కగా ఆరోగ్యంగా కలిగిన వారు చదువులో కూడా బాగా రాణిస్తారని అన్నారు.ఏంపిడిఓ ఫణింద్ర మాట్లాడుతూ చక్కగా ప్రతిభ కనబరిచి ఆటలు ఆడాలని, రాబోయే రోజుల్లో ఈ ఎస్ జి ఎఫ్ ఐ సర్టిఫికెట్ వివిధ కోర్సులకు పనిచేస్తుందని తెలిపారు.

# మొక్కను నాటుదాం.. జీవకోటికి ప్రాణదాతలవుదాం




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ వర్షకొండ గ్రామంలో ఎంపిడీవో మహమ్మద్ సలీం మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ,జన్మనిచ్చిన కన్నతల్లి పేరున ప్రతి ఒక్కరు మొక్కను నాటి అది వృక్షమయ్యే వరకు సంరక్షించాలని మండలంలోని అన్ని గ్రామాలలో కూడా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లుగా మరియు సంబంధిత గ్రామ ప్రజలందరూ కూడా వారికి ఉన్నటువంటి స్థలాలలో వారికి జన్మనిచ్చినటువంటి తల్లి పేరున మొక్కలు నాటి సంరక్షించుకోవడం వలన రాబోయే తరానికి మంచి ఆరోగ్యవంతమైనటువంటి వాతావరణాన్ని ఏర్పాటు చేసిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, ప్రవీణ్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వినోద్,సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్జరీ చేసి భూమిని ఆక్రమించుకున్న వ్యక్తుల అరెస్ట్

**వేద న్యూస్, శాయంపేట:**


ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన వ్యక్తులను అరెస్టు చేసినట్టు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం కొప్పుల గ్రామశివారులోని అడిదల మల్లారెడ్డి కి వారసాత్వాంగా సంక్రమించిన భూమిలోనుండి పదునాలుగు గుంటల భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్న కొప్పుల గ్రామస్థుడు అయిన దేవు ఉప్పలయ్య వారి కుమారులు దేవు వెంకటయ్య, దేవు సాంబయ్య, దేవు రాజయ్య అనువారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

# రోడ్డుకు నామరూపాల్లేవ్!

**- 2 మండలాలను కలిపే రహదారి అస్తవ్యస్తం - తీవ్రంగా దెబ్బతిన్న కోనరావుపేట, చందుర్తి మండలాలను కలిపే రహదారి**

**వేద న్యూస్, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రానికి మండలానికి వెళ్లే ప్రధాన మార్గం దెబ్బ తిన్నది. వర్షాలు రావడంతో మూల వాగు ప్రవాహంతో రోడ్లు కొట్టుకపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోనరావుపేట, చందుర్తి. రెండు మండలాలను కలిపే ఈ రహదారి, అలాగే వేములవాడకు వెళ్లే ప్రధాన రహదారి, కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే దారీ తీవ్రంగా దెబ్బతిన్నది. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు లోలెవెల్ వంతెన పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు, ముఖ్యంగా వేములవాడకు వెళ్లే వాహనదారులు ఈ మార్గం మీదనే వెళ్తుంటారు. అయితే మూలమలుపులు, వంతెనల దగ్గర రహదారి పూర్తిగా కోతకు గురవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు రిపేర్ చేసినా ప్రతీ ఏడాది వర్షాలు రావడంతో మూల వాగు ప్రవాహానికి రహదారి కొట్టుకపోయి ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత





పరిష్కారం చూపించి ప్రజలకు సురక్షిత రవాణా కల్పించాలని రెండు మండలాల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పడం కాదు.. చేతల్లో పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆవాస్ యోజన సమాచారం త్వరగా పూర్తి చేయాలి



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో ఆవాస్ యోజన సమాచారాన్ని ఆన్లైన్ నందు నమోదు చేస్తున్న వివరాలను శుక్రవారం ఎంపీడీవో మహ్మద్ సలీం పరిశీలించారు. ఈ సందర్భంగా మహమ్మద్ సలీం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో రెండు రోజులలోగా ఆవాస్ యోజన ఆన్లైన్ నందు సంబంధిత సమాచారాన్ని అప్లోడ్ చేయవలసిందిగా పంచాయతీ కార్యదర్శిలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్,పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి యువనేత మద్దుల అండ



**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**

నిరుపేద కుటుంబానికి యువనేత మద్దుల ప్రశాంత్ పటేల్ తన వంతు సాయం చేసి అండగా నిలిచారు. వీణవంక మండల పరిధిలోని లస్మక్క పల్లి గ్రామానికి చెందిన దాసారపు నరసయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మద్దుల ప్రశాంత్ పటేల్.. నరసయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దాసరపు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సుజాత లక్ష్మణ్, దోమకొండ రవి, లింగాల నారాయణరెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విలువలతోనే వ్యక్తిత్వ వికాసం




**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**

నైతిక విలువలతోనే వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని జమ్మికుంట పట్టణ ప్రముఖ కంటి వైద్యులు సి హెచ్. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీ. రమేష్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం "గ్రాండ్ పేరెంట్స్ మంత్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోని మంచి ప్రయోజకులు కావాలని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు. అలాగే రిటైర్డు అధ్యాపకులు సి మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయి కి ఎదుగాలన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సి. మల్లికార్జున్ లను కళాశాల అధ్యాప కులు శాలువాల తో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో వైస్ – ప్రిన్సిపాల్, డాక్టర్ ఓదేలు కుమార్, అకడమిక్ కో – ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రం స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ గణేష్ , ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవీందర్, అధ్యాపకులు డాక్టర్ శ్యామల, డా, మాధవి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, మమత, డా.రవిప్రకాష్. డాక్టర్ సుష్మ, డాక్టర్ శ్రీనివాస్, శివకృష్ణ, రవీందర్, ప్రశాంత్ , అరుణ్ కుమార్ , సాయి విద్యార్థులు, వలంటీర్లు తదితరులు పాల్గోన్నారు .

# మహిళకు జైపూర్ ఫుట్ అందజేత

**– ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**




**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**

హైదరాబాద్ లోని ఈ సీ ఐ ఎల్ కు చెందిన దీటి లక్ష్మి అనే గృహిణి ప్రమాదవశాత్తు తన కుడికాలు కోల్పోయినది. ఆమెకు నడవడానికి ఇబ్బంది అవుతుండగా, ఈ విషయమై.. ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ ను సంప్రదించగా, ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో ఆమెకు భగవాన్ మహావీర్ హైదరాబాద్ వారి సౌజన్యంతో.. ఆమెకు జైపూర్ ఫుట్ ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆలయఫౌండేషన్ వారికి, పరికిపండ్ల నరహరి ఐఏఎస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073